సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



ఒత్తిడిని 'ఉఫ్' అనండి..

మార్చి ఒకటి నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఒత్తిడిని జయించాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



గుప్పుమన్న గంజాయి

నలుగురు యువకులు 21 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురిపై గతంలోనూ కేసులున్నాయి. - 8లో

కల్యాణ వైభోగమే..





కల్యాణమూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

వాసుదేవుడి పెళ్లికి ఊరంతా అతిథులయ్యారు. దేవదేవుడి కల్యాణోత్సవాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం చెందారు. మందసలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణ క్రతువు నిర్వహించారు. పూబంతులాట, పుష్ప మాల నృత్యాలు, కట్న చదివింపులు సంప్రదాయబద్ధంగా జరిగాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆండాళ్లగోష్టి, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి గరుడ వాహనసేవలో కల్యాణ దంపతులైన శ్రీభూసమేత వాసుదేవుడ్ని మందస పురవీధుల్లో ఊరేగించారు.

–కాశీబుగ్గ

న్యూస్‌రీల్

అచ్చెన్నాయుడివన్నీ అబద్ధాలే

- గత ప్రభుత్వంలో మిర్చి రైతులను అన్ని విధాలా ఆదుకున్నాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మిర్చి రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారని, అప్పటి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం మిర్చి రైతులను పట్టించుకోలేదని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ హయాంలో మిర్చికి గరిష్టంగా రూ.27 వేలు వరకూ ధర పలికిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మిర్చి రైతులు దిగుబడి తగ్గి పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలకు అనుగుణంగా మిర్చితో సహా ఇతర పంటలకూ అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం ధరలు ప్రకటించిందని, ఐదేళ్ల తర్వాత ఇప్పటి రేట్లతో పోలుస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ఏమనాలని ప్రశ్నించారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న యూఎఫ్‌బీయూ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు నగరంలోని కళింగ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ కన్వీనర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ బ్యాంకులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం ఖండించాలన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అంతేకాకుండా ఐదు రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలన్నారు. రుణాలకు సంబంధించిన ట్యాక్సుల వసూలు ఆలోచనను యాజమాన్యాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ కో–ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు గిరిధర్ నాయక్ మాట్లాడుతూ బ్యాంకుల్లో తాత్కాలిక ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. బ్యాంకుల్లో తాత్కాలిక నియామకాలు కాకుండా శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ జి.కరుణ, కో–ఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఎ.సూర్య, ఓబీసీ ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్, శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం మండలం ఇన్నేశుపేటలో ఈ నెల 28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సైనికోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు 3,4,5 తరగతుల విద్యార్థులు అర్హులని, వివరాలకు 9441569363 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అకాల వర్షం.. రైతన్నల హర్షం

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి, పెద్దమడి, చీపురుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఎండ నుంచి ఉపశమనం లభించడంతో పాటు నువ్వు, పసుపు, కూరగాయలు, వేసవి వరి సాగుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో వర్షాలతో జీడి మామిడి పువ్వు, పిందె రాలటం ఆగి పంట దిగుబడులు పెరుగుతాయని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు.



చీపురుపల్లిలో కురుస్తున్న వర్షం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి.. రాజకీయ రంగు

ఏపీటీఎఫ్ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు టీడీపీ మద్దతు

- అన్ని రకాల యుక్తులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు
- ఇప్పుడదే శాపంగా మారిన వైనం
- దూరమవుతున్న ఉపాధ్యాయ వర్గాలు
- ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి
- జోష్‌లో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు
- తొలిసారి గెలుపు కోసం యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు రాజకీయ రంగు పులుముకుంది. ఇప్పుడదే ఓ అభ్యర్థికి శాపంగా పరిణమించింది. ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న పాలకపక్షం ఏపీటీఎఫ్ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు ప్రత్యక్షంగా మద్దతు పలకడంతో ఆ అభ్యర్థికి మైనస్‌గా మారింది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిందెవరో ఇప్పటికే ఉపాధ్యాయ వర్గాలకు క్లారిటీ వచ్చేసింది. కాకపోతే, అధికారంలో ఉన్న పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, తమ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు బాధ్యత అప్పగించడంతో పాటు గెలిపించి తీరాలన్న ఒత్తిడితో ఆ ప్రజాప్రతినిధులంతా శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. అలవాటైన అధికార దర్పాన్ని ప్రదర్శించి, ఉపాధ్యాయ వర్గాలను ప్రభావితం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ స్థానం నేపథ్యమిది..

ఈ నెల 27న 123 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ జరగనుంది. 22,493 మంది ఓటర్లు ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీ అధ్యాపకులు, ప్రైవేటు కాలేజీ, హైస్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లు ఓటర్లుగా ఉన్నారు. బరిలో 10 మంది ఉన్నప్పటికీ పోటీ ప్రధానంగా ముగ్గురు వ్యక్తుల మధ్యే నడుస్తోంది. పీఆర్‌టీయూ తరఫున గాదె శ్రీనివాసులనాయుడు, పీడీఎఫ్ తరఫున యూటీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, ఏపీటీఎఫ్ తరఫున పాకలపాటి రఘువర్మ (సిటింగ్ ఎమ్మెల్సీ) ప్రధానంగా పోటీ పడుతున్నారు. మిగతా ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు.

జోష్‌లో ఉన్న గాదె..

గతంలో రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేయడం, ఏ విషయాన్నయినా ఎంఈఓ నుంచి కలెక్టర్, మంత్రులు, ఉన్నతాధికారుల వరకు అందరి దృష్టికి తీసుకెళ్లి పోరాటం చేసిన వ్యక్తిగా గాదె శ్రీనివాసుల నాయుడికి గుర్తింపు ఉంది. సామాజికవర్గం కూడా ప్లస్‌గా మారింది. ఇతర సంఘాల్లో ఉన్న వెలమ, కొప్పలవెలమ సామాజిక వర్గీయులు అండగా నిలుస్తున్నారు.

గెలుపుపై ఆశతో యూటీఎఫ్

పీడీఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరిని యూటీఎఫ్ బలపరిచింది. ఈమె ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఎన్నికల బరిలో దిగారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఉపాధ్యాయవర్గంలో మంచి పట్టు ఉంది. యూటీఎఫ్ ఒక్కసారి కూడా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేదు. ఈ సారైనా ఆ మచ్చను చెరుపుకుని, గెలవాలన్న కసితో ఉన్నారు. అయితే, సొంత సంఘం నుంచి అనుకున్నంత సహకారం అందడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా అందులోని ఓ సామాజిక వర్గం మరో అభ్యర్థికి అంతర్గతంగా సహకరిస్తున్నారన్న ప్రచారం నడుస్తోంది.

ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల అసంతృప్తి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 జూలైలో ఇన్‌టైమ్‌లోనే వేతన సవరణ సంఘాన్ని వేశారు. దానికి 15 రోజుల్లోనే రిటైర్డ్ ఐఏఎస్ మన్మోహన్‌సింగ్‌ను వేతన సవరణ సంఘం చైర్మన్‌గా నియమించారు. పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, ఐఆర్ కాకుండా మే, జూన్ నాటికే నేరుగా వేతన సవరణ అమలు చేస్తామని ప్రకటించారు. ఈ లోపు ఎన్నికలు రావడం, చంద్రబాబు భారీగా హామీలు గుప్పించడంతో ఆ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఈ ప్రభుత్వంలో పనిచేయలేనంటూ వేతన సవరణ సంఘం చైర్మన్ మన్మోహన్‌సింగ్ జూలైలో తప్పుకున్నారు. అయినా ఇంతవరకు చైర్మన్‌ను నియమించలేదు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలు గడిచినా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. ప్రావిడెంట్ ఫండ్, రుణాలు, ఏపీ ఉద్యోగుల జీవిత బీమా అడ్వాన్సులు, పదవీ విరమణ చేసిన వారికి చెల్లింపులు చేయలేదు. ఎంతసేపూ గత ప్రభుత్వంపై నెపం నెట్టడమే తప్ప ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇటీవల సంక్రాంతి సందర్భంలో బకాయి చెల్లింపులు ప్రకటనలకే పరిమితమైందే తప్ప ఏ ఉద్యోగి ఖాతాలో రూపాయి కూడా జమ చేయలేదు. పాఠశాలల మ్యాపింగ్ వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో 3వేలకు పైచిలుకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులు కానుండగా, ఉన్నత పాఠశాలల్లో సుమారు 1800 మంది స్కూల్ అసిస్టెంట్లు రోడ్డున పడుతున్న దుస్థితి నెలకొంది. విత్‌డ్రా డ్రాఫ్ట్ రూల్స్‌తో జీఓ 117 తీసుకురావడాన్ని ఉపాధ్యాయులు తట్టుకోలేకపోతున్నారు.

ఆ విధానాలే రఘువర్మకు శాపం..

ఉపాధ్యాయ వ్యతిరేకత విధానాలే సిటింగ్ ఎమ్మెల్సీ, టీడీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు శాపంగా మారాయి. భీమిలి ఎమ్మెల్యే టికెట్ కోసం పనిచేసినంతగా ఎమ్మెల్సీగా తన బాధ్యతలు నిర్వర్తించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఏ రోజూ సభలో మాట్లాడలేదని, గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన సంఘాలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయలేదనే అపవాదు మూటగట్టుకున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే గత ఎన్నికల్లో యూటీఎఫ్ మద్దతుతో ఏపీటీఎఫ్ అభ్యర్థిగా రఘువర్మ గెలిచారు. ఈ సారి యూటీఎఫ్ ప్రత్యేకంగా పోటీ చేస్తోంది. ఇవన్నీ ఇప్పుడు మైనస్‌గా మారాయి. ఈ నేపథ్యంలో పాకలపాటి రఘువర్మ గెలుపుకోసం టీడీపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. మంత్రిగా ఉన్న నారాయణ తన విద్యా సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్ని, అదే పార్టీలో నేతగా ఉన్న భాష్యం విద్యా సంస్థల్లో ఉన్న ఉపాధ్యాయులను ప్రభావితం చేసి, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు యత్నిస్తోంది. చైతన్య విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై కూడా వల వేస్తోంది. ఇందుకోసం గ్రామస్థాయి నేతల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వరకు రంగంలోకి దించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది.

పర్యాటక కేంద్రంగా ఎర్రముక్కాం తీరం



తీరంలో రాళ్లను పరిశీలిస్తున్న టూరిజం అధికారులు

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం సముద్ర తీరం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు అన్నారు. శుక్రవారం ఎర్రముక్కాం సముద్రతీరాన్ని టూరిజం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 75 తీర ప్రాంతాలు ఉన్నాయని, అందులో ఎర్రముక్కాం తీరంలో 500 మీటర్ల పొడవునా రాళ్లు ఉండటం ప్రత్యేక ఆకర్షణగా ఉందన్నారు. పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాంతం అనువుగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ నాగరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

15 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని 15 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో శ్రీకాకుళం మండలంలో 8 కేంద్రాలు, ఎచ్చెర్ల మండలంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలను ఆఫ్‌లైన్ విధానంలో రాయాల్సి ఉంటుందన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–ఐ, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–ఐఐ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సందేహాల కోసం కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నంబర్ 08942 240557ను సంప్రదించాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలైన కాలిక్యులేటర్, సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, బ్లూ టూత్ వంటివి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించమన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 54 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం వీల్స్ ఇండియా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన 115 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 54 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా కంపెనీల ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపికైన వారిని నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి బి.తులసీరావు, కంపెనీ ప్రతినిధులు దివాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంబరం

మొదటి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసునాయుడికి సత్కరిస్తున్న దృశ్యం



- ఘనంగా కొత్తూరు జూనియర్ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు
- పూర్వ అధ్యాపకులకు సత్కారం

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రిన్సిపాల్, అధ్యాపకులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆనాటి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ తిరుమల చైతన్య మాట్లాడుతూ మార్కులు ఒక్కటే కొలమానం కాదని, నైతిక విలువలు పాటిస్తూ జీవితంలో ముందుకు సాగాలని యువతరానికి పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన దాతలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాళ్లు ఎద్దు గోపాలదాసునాయుడు, డి.సీతారాములు, సోమలింగం, యాసిమ్, లోకనాథం, బీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

చదువు.. కొలువు ఇక్కడే



కొత్తూరులో 1974లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయడంతో ఉన్నత చదువులు చదివేందుకు ఉపయోగపడింది. ఇక్కడే ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. ఈ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసే అవకాశం దక్కడం ఆనందంగా ఉంది.

– సుందరరావు, పూర్వ విద్యార్థి, పారాపురం

ఆనందంగా ఉంది..



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల పుణ్యమా అని పూర్వ విద్యార్థులంతా ఒకే వేదిక వద్ద కలుసుకోవడం ఆనందంగా ఉంది. చదువుకున్న కాలేజీ రుణం తీర్చుకునేందుకు విరాళాలు అందించడంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి.

– ఏ.గోవిందరావు, పూర్వ విద్యార్థి, ఇరపాడు

గర్వకారణం



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడం, 43 ఏళ్ల తర్వాత స్నేహితులను కలవడం గర్వంగా ఉంది. ఇటువంటి ఉత్సవాలు నిర్వహించడం వల్ల సరికొత్త అనుభూతి కలుగుతుంది. అప్పటి అధ్యాపకులను కలవడం మర్చిపోలేని అనుభూతి.

– బసప రాంబాబు, పూర్వ విద్యార్థి, పారాపురం

ఆరోగ్యశ్రీ సేవలపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ. చిత్రంలో సీఈవో శ్రీధర్‌రాజా

- సామాన్యులకు దూరం చేస్తున్నారని సభ్యుల ఆవేదన
- మెరుగైన సేవలందించాలన్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ
- ఫేక్ సర్టిఫికెట్ల నిందితులపై చర్యలకు ఆదేశం

అరసవల్లి: జిల్లాలో వైద్యారోగ్య శాఖ సేవలు సామాన్యులకు దూరమవుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. 2వ, 4వ, 7వ స్థాయీ సంఘ సమావేశాల్లో పలు ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రిమ్స్ సేవలతో పాటు ఆరోగ్యశ్రీ సేవలు దారుణంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ వర్తించదని చెబుతున్న కేసులకు పక్క జిల్లాల్లో అవే కేసులను ఎలా స్వీకరించి ఆపరేషన్స్ చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా మాట్లాడుతూ సేవలను మెరుగుపర్చుతామని సమాధానమిచ్చారు. అనంతరం పలు శాఖల ప్రగతి నివేదికలపై సమీక్షించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘ సమావేశాల్లో 2వ, 4వ, 7వ స్థాయి సమావేశాలు మాత్రమే జరిగాయి.

బాధితురాలికి న్యాయం చేయండి..

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఫేక్ జాయినింగ్ ఆర్డర్ వ్యవహారంపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆరా తీశారు. 4వ స్థాయీ సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నకిలీ ఉద్యోగాల పేరిట ఎస్.ధనలక్ష్మి అనే నిరుద్యోగి నుంచి రూ.4.50 లక్షలను వసూలు చేసిన వ్యవహారంపై కారకులపై చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణను ఆదేశించారు. దీనిపై డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అక్రమ వసూళ్లు, నకిలీ జాయినింగ్ ఆర్డర్ వ్యవహారంపై విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారని వివరించారు. త్వరలోనే బాధ్యులపై చర్యలుంటాయని తెలిపారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షించారు.

క్లుప్తంగా

పది పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

హిరమండలం: పదో తరగతి పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి నుంచి సమాధానాలు రాబట్టారు. స్పెషల్ క్లాసుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని అన్ని తరగతులను పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో పాటు డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకరరావు, హెచ్ఎం కేశవరావు ఉన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గౌరీశంకర్‌ను బారువ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఒడిశాకు చెందిన గౌరీశంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బరంపురం నుంచి హరిపురం వైపునకు ద్విచక్ర వాహనంపై వస్తున్న గౌరిశంకర్ అదుపుతప్పి కాలువలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. హైవే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని బారువ ఆస్పత్రికి తరలించారు.

మిల్లుల సామర్థ్యం మేరకే ధాన్యం కేటాయింపులు


- అందులో నాయకుల ప్రమేయం, ఒత్తిడి లేదు
- జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ధాన్యం కొనుగోలుపై 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 10న ప్రచురితమైన 'అయిన వారికి ప్రాధాన్యం - కాని వారి దైన్యం' శీర్షికతో వచ్చిన వార్తపై జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో స్పందించారు. మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయించినట్టు తెలిపారు. మూడు విడతలుగా మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరిగాయని, 18 మిల్లులకు 100 ఏసీకేల కంటే ఎక్కువ కేటాయింపులు జరిగాయనడంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలంలోని ప్రేమ ఇండస్ట్రీస్‌కు 112.09ఏసీకేలు, శ్రీ సూర్య రత్న మోడరన్ రైస్ మిల్లుకు 112.25ఏసీకేలు, శ్రీ కృష్ణ మోడరన్ రైసు మిల్లుకు 106.93ఏసీకేలు, నందిగాంలోని శ్రీ వెంకటేశ్వర ఎంఆర్‌ఎంకు 112.05ఏసీకేలు, శ్రీ లక్ష్మీ నర్సింహ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 109.13ఏసీకేలు, జలుమూరులోని శ్రీ వెంకట శాంతమణి ఎంఆర్ఎంకు 111.98 ఏసీకేలు, ఎండల కామేశ్వరస్వామి రైస్ మిల్లుకు 111.45 ఏసీకేలు, ఎల్ఎన్‌పేటలోని శ్రీనివాస్ ఎంఆర్ఎంకు 104.50 ఏసీకేలు, నరసన్నపేటలోని శ్రీ వెంకట లక్ష్మీ రైస్ మిల్లుకు 112.36 ఏసీకేలు, శ్రీలక్ష్మీ నాగేశ్వర మిల్లుకు 111.98 ఏసీకేలు, శ్రీ శాంతామణి ఇండస్ట్రీస్‌కు 104.46 ఏసీకేలు, శ్రీ శాంతారాం ఎంఆర్ఎంకు 103.89 ఏసీకేలు, శ్రీ సీతారాం ఎంఆర్ఎంకు 109.73 ఏసీకేలు, సంతబొమ్మాళి జానకీరామ ఎంఆర్ఎంకు 109.02 ఏసీకేలు, సారవకోటలోని శ్రీ సాయి శ్రీనివాస ఎంఆర్ఎంకు 104.50 ఏసీకేలు, శ్రీకాకుళంలోని శ్రీ లక్ష్మీ గణపతి రైసు మిల్లుకు 102.60 ఏసీకేలు, మారుతీ రైసు మిల్లుకు 102.36 ఏసీకేలు, సీతారామ రైసు మిల్లుకు 105.24 ఏసీకేలు మేర వార్తలో ప్రస్తావించినట్టుగా కేటాయింపులు చేయలేదని అన్నారు. మిల్లులకు కేటాయింపుల విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం గానీ, మరే ఇతరుల ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. 274 రైసు మిల్లులకు ధాన్యం మిల్లింగు సామర్థ్యం, సీఎంఆర్ కింద బియ్యం అప్పగింతల సామర్థ్యం దృష్టిలో పెట్టుకుని లక్ష్యాలు నిర్దేశించినట్టు తెలిపారు.



ఒత్తిడిని ఉఫ్ అనండి..

విజేత మీరేనండి..!



- మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- పక్కాగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఒత్తిడి జయిస్తే విజయం సులువేనంటున్న నిపుణులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థి దశలో అత్యంత ముఖ్యమైన పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఇంటర్ పరీక్షలకు వారం రోజులు, టెన్త్ పరీక్షలకు 25 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. పరీక్షలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ఎక్కువసార్లు రివిజన్ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అయితే ఇదే సమయంలో ఒత్తిడిని జయిస్తేనే విజయంవైపు సులభంగా వెళ్లగలమని నిపుణులు సూచిస్తున్నారు. టెన్షన్ పడితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

75 కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, టెన్త్‌క్లాస్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి మొదలవ్వనున్నాయి. జిల్లావ్యాప్తంగా 75 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 40,356 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక పదో తరగతి పరీక్షలను 149 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. 28,984 మంది విద్యార్థులు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు 807 మంది, ఇంటర్ విద్యార్థులు 1,553 మంది పరీక్షలకు ఫీజులు చెల్లించారు. ఈ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ



పరీక్షలకు సమయం సమీపిస్తుండడంతో పిల్లలు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని మొత్తం 410 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు. పక్కా ప్రిపరేషన్‌తో మంచి మార్కులు సాధించేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను సూచిస్తున్నారు. పరీక్షల సమయంలో ఆందోళనకు గురవ్వకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ మార్కులు సాధించవచ్చని చెబుతున్నారు.

సమయమే ముఖ్యం



సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే అంశంపైనే సాధించే మార్కుల శాతం ఆధారపడి ఉంటుంది. సబ్జెక్టు, టాపిక్ ప్రాధాన్యతలను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలా మంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం ఇవ్వడం మంచిది.

– కె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల

చేతిరాతపై దృష్టి పెట్టాలి



నీ పని నువ్వు శ్రద్ధగా చేయ.. ఫలితం దానంతట అదే వస్తుందన్న నానుడిని విద్యార్థులు మరువకూడదు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. రివిజన్ పదేపదే చేస్తుండాలి. వెనుకబడిన సబ్జెక్టులు, టాపిక్‌లపై ఎక్కువ దృష్టి సారించాలి. ఒత్తిడిని జయించేందుకు ఉపాధ్యాయులు సూచనలు చేస్తుండాలి. మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా దృష్టి పెట్టాలి.

– బలివాడ మల్లేశ్వరరావు, విశ్రాంత డీఈవో


ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయగలిగితే శరీరం యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఫలితం గురించి ఆలోచించకుండా, మానసికంగా ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి.

– డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ కుమార్, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ, శ్రీకాకుళం

విద్యార్థులూ ఇవి గుర్తుంచుకోండి..



- పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి. కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- టైం టేబుల్ సిద్ధం చేసుకోవాలి.
- కాస్త కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి.
- పరీక్షల సమయంలో క్విక్ రివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
- తోటి విద్యార్థులతో అప్పుడప్పుడు సబ్జెక్టుపై చర్చించుకోవాలి.
- పాత ప్రశ్న పత్రాలు, మోడల్ ప్రశ్న పత్రాలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. బయట హోటల్స్ ఫుడ్ తీసుకోకపోవడం మంచిది.
- విరామమే లేకుండా చదవడం సరికాదు.
- ప్రశాంతంగా రోజుకి 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి.
- పూర్తి పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండాలి. ఎవరి మాటలకు తలొగ్గకూడదు. ఒత్తిడికి గురవ్వకూడదు.
- పరీక్షలు ముగిసే వరకు మరీ ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు, సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

రివిజన్ కీలకం



విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టిపెట్టి, వచ్చిన వాటిపై కాస్త నిర్లక్ష్యం వహిస్తారు. అయితే ఎంతో బాగా నేర్చుకున్న సమాధానాలైనా కొన్నిరోజులకు మర్చిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చుకున్న అంశాలను కూడా తరచూ రివిజన్ చేస్తుండాలి. ఇంటర్ పరీక్షలకు కేవలం వారం రోజుల వ్యవధి మాత్రమే ఉంది. అన్ని పాఠశాలల్లో టెన్త్ సిలబస్ పూర్తయ్యింది. ఈ సమయంలో విద్యార్థులకు రివిజన్ చాలా కీలకం. – ఆర్.విజయకుమారి, ఉప విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం డివిజన్

సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



సమాజం కోసం పరిశోధనలు చేయాలి

టెక్కలి: పీజీ, పీహెచ్‌డీ చేసేవారు సర్టిఫికెట్ల కోసం కాకుండా సమాజం కోసం పరిశోధనలు చేయాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ స్వామినాయుడు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆరెన్డీ సెల్ ఆధ్వర్యంలో పరిశోధకుల సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆదిత్య కళాశాలలోని రీసెర్చ్ విభాగంలో ఇప్పటివరకు 12 మంది పీహెచ్‌డీ పట్టాలు పొందారని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ ఏడాది 31 మంది కళాశాలలో చేరారని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కోర్సులతో పాటు గణితం, కెమిస్ట్రీ, ఎంబీఏ సంబంధిత కోర్సుల్లో సైతం పీహెచ్‌డీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో జర్మనీ డ్రెస్‌డెన్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ విధానం క్లియర్ చేయాలి



ధర్నా చేస్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

- గ్రూప్-2 అభ్యర్థుల డిమాండ్

శ్రీకాకుళం అర్బన్: రోస్టర్ విధానం క్లియర్ చేశాకే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్నామని, అయితే 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో పాత పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రూప్-2 రోస్టర్ తప్పులపై హైకోర్టు తీర్పులో రీడ్రా రోస్టర్ పాయింట్స్ అని చెప్పడం జరిగిందన్నారు. దీని కారణంగా రోస్టర్ క్లియర్ చేయకుండా మెయిన్స్ నిర్వహిస్తే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నోటిఫికేషన్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం రోస్టర్ క్లియర్ చేశాకనే మెయిన్స్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పి.నవీన్, జి.సునీంద్ర, టి.జగదీష్, ఎం.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించాలి

- హైవే అధికారుల విజ్ఞప్తి

రణస్థలం: రణస్థలం టౌన్‌లో జాతీయ రహదారుల సంస్థ నిర్మించనున్న ఫ్లై ఓవర్ పనులకు జేఆర్‌పురం ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని జాతీయ రహదారుల సంస్థ విశాఖపట్నం డివిజన్ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు, జేఆర్‌పురం గ్రామస్తులు, వ్యాపారస్తులతో రెవెన్యూ, పోలీసులు, హైవే అధికారులు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. ఫ్లై ఓవర్ నిర్మాణం వలన ఎవరికీ ఎటువంటి అన్యాయం జరగదన్నారు. హైవే డిప్యూటీ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ 1.4 కిలోమీటర్లు మేర 45 మీటర్ల కొలత ప్రాప్తికే పనులు చేస్తామని, చివరలో



మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ మేనేజర్ సతీష్

60 మీటర్లు ఉంటుందన్నారు. 800 మీటర్ల వరకు 25 సింగల్ ఫిల్లర్లు వస్తాయని, మిగతా 1,600 మీటర్ల వాల్ ఫ్లై ఓవర్ వస్తుందని వివరించారు. పైన 25 మీటర్ల పైవంతెన ఉంటుందని, కిందన 10.5 మీటర్ల సర్వీస్ రోడ్డు ఉంటుందని తెలియజేశారు.

బైపాస్ నిర్మించాలి

సమావేశంలో ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ.. ఫ్లై ఓవర్ వలన రణస్థలం అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన బైపాస్‌ను నిర్మించాలని పునరుద్ఘాటించారు. 45 మీటర్ల పరిధిలో ప్రస్తుతం ఫ్లై ఓవర్ వేస్తే అది నిరుపయోగమే అవుతుందన్నారు. ఇరుకైన ఫ్లై ఓవర్ వేయడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయని తెలియజేశారు. త్వరలో గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ వస్తున్నందున ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, హైవే ఇంజినీర్ మహేష్, రెవెన్యూ సూపరింటెండెంట్ డి.నారాయణమూర్తి, మండల సర్వేయర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమన్న గంజాయి

- 21 కిలోల గంజాయితో పట్టుబడిన నలుగురు యువకులు
- వీరిలో ముగ్గురిపై గతంలోనూ కేసులు



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ కె.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్: ఒడిశా నుంచి జిల్లామీదుగా గంజాయి విచ్చలవిడిగా రవాణా జరగడంతో పాటు, క్రయవిక్రయాలు జరుగుతున్నాయనడానికి 21 కిలోల గంజాయితో నలుగురు యువకులు శుక్రవారం ఉదయం పట్టుబడిన ఘటనే నిదర్శనం. డీఎస్పీ సీహెచ్ వివేకానంద నేతృత్వంలో రూరల్ సీఐ సీహెచ్ పైడపునాయుడు, ఎస్ఐ కె.రాములు రెవెన్యూ విభాగం సమక్షంలో మాటువేసి పట్టుకున్నారు.

ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.వి.రమణ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

పర్లాకిమిడిలో కొనుగోలు

శ్రీకాకుళం మండలం భైరివానిపేటకు చెందిన బగ్గు నవీన్, పాత్రునివలస గ్రామానికి చెందిన ధర్మాన ప్రవీణ్ కుమార్, నగరంలోని దమ్మలవీధికి చెందిన చీకటి యోగేశ్వరరావు, పెద్దరెల్లివీధికి చెందిన జలగడుగుల తారా వికాస్‌లకు ఇదివరకే పరిచయముంది. వీరు ఒక్కొక్కరూ రూ.30 వేలు చొప్పున డబ్బులు వేసుకుని నవీన్‌కు గంజాయి తీసుకు రమ్మని ఇచ్చారు. నవీన్ సోదరి పర్లాకిమిడిలో ఉండడంతో అక్కడికి ఈనెల 17న వెళ్లి రెండురోజులు ఉన్నాడు. అనంతరం ఒక ముసలి సాధువు వద్ద 21 కిలోల గంజాయిని రూ.1.05 లక్షలకు కొనుగోలు చేశాడు. అనంతరం కొన్న గంజాయిని ఒక ప్లాస్టిక్ గోనె సంచిలో ఉంచి ఎవరికీ కనిపించకుండా సింగుపురం హాటకేశ్వరస్వామి గుడి కొండ కింది భాగంలోని తుప్పల్లో దాచాడు.

పంచుకుంటూ.. పట్టుబడ్డారు

శుక్రవారం ఉదయం రూరల్ ఎస్ఐ రాముకు సమాచారం రావడంతో అదే గుడి వద్దకు వెళ్లగా నలుగురు యువకులు బ్యాగులో ఉన్న గంజాయిని సమభాగాలుగా పంచుకుంటూ పట్టుబడ్డారు. పట్టుబడిన నలుగురిలో ధర్మాన ప్రవీణ్‌పై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో (2021లో) మూడు చోరీ కేసులు, బూర్జ పీఎస్‌లో రెండు, రూరల్ పీఎస్‌లో మూడు, కాశీబుగ్గ, నరసన్నపేట, శ్రీకాకుళం ఒకటి, రెండో పట్టణ పీఎస్‌ల్లో చెరో ఒకటి చొప్పున చోరీ కేసులున్నాయన్నారు. చీకటి యోగేశ్వరరావు, జలగడుగుల తారా వికాస్‌లు ఇదివరకు గంజాయి కేసుకు సంబంధించి జైలుకు వెళ్లారు. కేసును చాకచక్యంగా ఛేదించినందుకు సీఐ పైడపునాయుడు, ఎస్ఐ రాము, ఏఎస్ఐ ఢిల్లేశ్వరరావు, హెచ్‌సీ సన్యాజ్, పీసీలు వరదరాజులు, వాసుదేవరావు, రాంబాబులను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అభినందించారు.

ఐదేళ్ల వయసు.. రోజూ డయాలసిస్

- ఐదేళ్లకే పాడైన బాలుడి కిడ్నీలు
- కిడ్నీ మార్పిడికి రూ. 10 లక్షల వరకూ ఖర్చు
- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోక్షిత్‌రామ్

నరసన్నపేట: ఆ బాలుడి వయసు కేవలం ఐదేళ్లు.. తోటి పిల్లలతో కలిసి ఏ బాదరబందీ లేకుండా ఆడుకోవాల్సిన ప్రాయం. అమ్మానాన్నల వెనుక అల్లరి చేస్తూ తిరగాల్సిన సమయం. కానీ ఆ పిల్లాడికి రోజూ ఆస్పత్రికి వెళ్తే గానీ ప్రాణం నిలబడదు. రోజుకోసారి రక్తం శుద్ధి చేస్తే గానీ ఆయుష్షు రేఖ పెరగదు. ఐదేళ్ల వయసులోనే రెండు కిడ్నీలు పాడైపోవడంతో దూసి మోక్షిత్‌రామ్ ప్రాణం కోసం పోరాటం చేస్తున్నాడు. బిడ్డ ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ తల్లిదండ్రులు సాయం కోరుతున్నారు. నరసన్నపేట మండలం కోమర్తికి చెందిన దూసి రాంజీ, పూజల సంతానం మోక్షిత్‌రామ్. పుట్టిన రెండేళ్ల వరకు బాగానే ఉన్న పిల్లాడికి మూడో ఏడు వచ్చాక ఆరోగ్యంలో మార్పులు వచ్చాయి. ముఖమంతా ఉబ్బి, శరీరమంతా ఇబ్బందిగా ఉంటే తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించారు. వైద్యులు అనుమానంతో వివిధ పరీక్షలు చేసి బాలుడి రెండు కిడ్నీలు బాగులేవని చెప్పారు. రెండేళ్లు మందులు వాడినా ప్రయోజనం కనిపించలేదు. డయాలసిస్ వరకు బాలుడి పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం చిన్నారి వయసు ఐదేళ్లు. ఏడాదిగా రోజూ డయాలసిస్ చేస్తున్నా ఆరోగ్యం మెరుగుపడడం లేదు. తాజాగా ఆరోగ్య పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీలు బాగా బలహీనమయ్యాయని చెప్పారు. కిడ్నీలు మారిస్తేనే మోక్షిత్ దక్కుతాడని అన్నారు. కిడ్నీ మార్పిడికి విశాఖకు చెందిన ఒక ప్రైవేటు ఆస్పత్రి ముందుకువచ్చింది. కానీ శస్త్ర చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న తండ్రికి అంత డబ్బు సర్దే శక్తి లేదు. ఇప్పటికే డయాలసిస్ చికిత్సల కోసం చాలా అప్పులు చేశారు. బంధువులు కొంత మేర సాయం చేసినా.. ఇంకా రూ.8 లక్షల వరకు అవసరమవుతోంది. దాతల సాయం చేస్తే తమ బిడ్డ ప్రాణాలు నిలబడతాయని కోరుతున్నారు.

ఈ సందర్భంగా తల్లిదండ్రులు గురువారం కోమర్తిలో విలేకరులతో మాట్లాడారు. తమకు సాయం చేయాలనుకునే వారు 8341729883 నంబర్‌ను సంప్రదించాలని రాంజీ కోరారు. దాతలు స్పందిస్తే తన బిడ్డ బతికి బయటపడతాడని అభ్యర్థించారు.

మాతృభాషను మరువద్దు



కవిటి: చిన్న ఎర్రగోవిందపుట్టుగలో చిన్నారుల ప్రదర్శన

ఉపాధి, ఉద్యోగరీత్యా ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని వక్తలు నినదించారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాతృభాష ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జి.సిగడాం: అద్వానంపేట(శ్రీరాంపురం) ప్రాథమిక పాఠశాలలో సంప్రదాయ వస్త్రధారణ



కవిటి: పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని